క్లుప్తంగా

కనకదుర్గమ్మకు చండీ హోమం



హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా మంగళవారం అమ్మవారికి చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన నంతరం చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాదాలు నివేదించారు. తరువాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చండీ హోమం, పూజ కార్యక్రమాలను వేదపండితులు సంతోష్ అవదాని, గంగాధరబట్ల శర్మ, కనకదుర్గ ఆలయ అర్చకులు కంచిబట్ల సాయిరామ్, వ్రత పురోహితులు చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు పూజలు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీన వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న భక్తులు రూ.750 చెల్లించి ఈ హోమంలో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



చింతలూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సూరిబాబు

ప్రత్తిపాడు రూరల్: పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం భారీ ఎత్తున ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని వైఎస్సార్ సీపీ యువ నేత వరుపుల సూరిబాబు అన్నారు. చింతలూరులో ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. చింతలూరు ప్రజలకు వెంకటనరం పంచాయతీ పరిధిలో 132 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. కోర్టు వివాదం కారణంలో అప్పట్లో పట్టాలు పంపిణీ అర్ధాంతరంగా నిలిచిపోయిందని, ప్రస్తుతం కోర్టు వివాదం పరిష్కారం కావడంతో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కర్రి మురళి, పార్టీ నాయకులు పంద్రాడి గంగారావు, పార్టీ నాయకులు గండేటి సత్తిబాబు, పల్లా వీరబాబు, గొడిసె అప్పలరాజు, మాసా అర్జున్, బోడపాటి బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



వేలంకలో రిజిస్ట్రేషన్ పనితీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కిర్లంపూడి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను త్వరితగతిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని వేలంక, సింహాద్రిపురం గ్రామాలలో మంగళవారం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో ఎదురయ్యే సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. సర్పంచ్ రాయుడు స్వామి, సెక్రటరీ ఎం. వీర్రాజు పలువురు ఉన్నారు.

అయోధ్య, కాశీ యాత్రలకు బస్సు సర్వీసు

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అయోధ్య, కాశీ యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ యు.రామన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో అరసవిల్లి, పూరీ, కోణార్క్, భువనేశ్వర్, జాజిపుర్, గయ, శిరోగయ బుద్ధగయ, కాశీ, సీతామాడి, ప్రయాగ, అయోధ్య, నైమీశరణ్యం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చన్నారు. 12 రోజుల పాటు సాగే ఈ యాత్రకు ఒక్కొక్కరికీ రూ.13 వేలు టిక్కెట్టు వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అల్పాహారం, భోజనం ఉచితంగా అందిస్తారన్నారు. డిపో పరిధిలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 62810 70787, 73829 10321 నంబర్లకు సంప్రదించాలన్నారు.

వ్యక్తి మృతి

కొత్తపల్లి: ఆర్టీసీ బస్సు పై నుంచి సామాన్లు దింపుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పాడ గ్రామానికి చెందిన రెడ్నం సత్యనారాయణ(70) కాకినాడ నుంచి తుని వెళ్లే ఆర్టీసీ బస్సులో కాకినాడలో కొనుగోలు చేసిన సామాన్లు బస్సుపై వేశాడు. అమీనాబాదు సెంటర్‌లో బస్సు నుంచి తన సామాన్లు దింపుతుండగా ప్రమాదవశాత్తు నిచ్చెనపై నుంచి కాలు జారి పడిపోయాడు. వెంటనే అతనిని 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సేద్యంలో మణిహారం

- ప్రకృతి వ్యవసాయంలో మహిళా రైతు అద్భుత ఫలితాలు
- కొత్త, పాతల కలయికతో ఆధునిక సాగు
- పొలంలోనే సేంద్రియ ఎరువుల తయారీ
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న బద్దా నాగమణి



రాచపల్లిలో కొబ్బరితోటతో అంతర్ పంటగా సాగు చేస్తున్న ఆకుకూరల తోట

ప్రత్తిపాడు: ప్రస్తుతం వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, మందుల వినియోగం అధికంగా ఉంది. అంతేకాకుండా పండ్లు, కూరగాయలు ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు ఎక్కువ మోతాదులో రసాయనాలు ఉపయోగిస్తున్నారు. వాటిని తినడం వల్ల కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు తక్కువ ఖర్చుతో అధిక, ఆరోగ్యకర దిగుబడి, ఆదాయం అర్జిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన బద్దా నాగమణి.

కాకినాడకు చెందిన రైతు గణేష్‌కు ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో ఎకరం కొబ్బరి తోట ఉంది. ఈ కొబ్బరి తోటకు రాచపల్లి గ్రామానికి చెందిన బద్దా అబ్బులు కాపలా కాసే పనికి కుదిరాడు. అబ్బులు తోటకు కాపలా కాస్తూ, కొబ్బరి సస్యరక్షణ పనులు చేస్తుండగా అబ్బులు భార్య కొబ్బరి తొటలో అంతర పంటలుగా ఆకు కూరలు, కాయగూరలు పండిస్తోంది. కొబ్బరి తోటలో సుమారు అర ఎకరం విస్తీర్ణంలో కూరగాయల సాగు చేసుకుంటూ భర్తకు చేదోడుగా ఉంటోంది.

ఇదిలా ఉండగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆకు కూరల, కాయగూరల సాగును పరిశీలించారు. ప్రకృతి సాగుపై ఆమెకు అవగాహన కలిగించారు. దీంతో ఆమె ప్రకృతి సాగు వైపు మొగ్గ చూపింది. ఘన, ద్రవ జీవామృతం తానే స్వయంగా తయారు చేసుకుని, మొక్కలకు వినియోగిస్తోంది. సేంద్రియ సాగు వల్ల పెట్టుబడి తగ్గడం, ఆరోగ్యకరంగా ఉండడంతో వినియోగదారులు వీటిని కొనుగోలు చేయడానికి మక్కువ చూపుతున్నారు.



ద్రవ జీవామృతం తయరు చేస్తున్న నాగమణి

ద్రవ జీవామృతం తయారీ

ఒక డ్రమ్ములో రెండు వందల లీటర్ల నీరు తీసుకుని, దీనిలో 10 కేజీల దేశీయ ఆవుపేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 2 కేజీల పాత బెల్లం, 2 కేజీల పప్పు దినుసుల పిండి, గుప్పెడు పుట్టమట్టి లేదా పొలం గట్టు మట్టిని తీసుకుని కలియబెట్టాలి. నాలుగు రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో సవ్యదిశలో కలుపుతూ ఉండాలి. ఇలా కలియబెట్టిన ద్రవ జీవామృతాన్ని మొక్కల మొదళ్లలో లేదా పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల మొక్కలకు అవసరమైన పోషకాహారం అందుతుంది.

అధిక దిగుబడి

ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించినపుడు కంటే ఘన, ద్రవ జీవామృతం, కషాయాలను వినియోగించినప్పుడు పంట అధిక దిగుబడి లభిస్తోందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు ఆరోగ్యదాయకమైన పంట ఉత్పత్తి అవుతోంది.

సేంద్రియ సాగుతో మేలు



సేంద్రియ సాగు వల్ల మేలు జరుగుతుంది. నేను ఇచ్చిన సూచనల వల్ల చీడపీడలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రైతే స్వంతంగా కషాయాలు, సేంద్రియ ఎరువు తయారు చేసుకోవడం వల్ల పెట్టుబడి తగ్గి, ఆదాయం సమకూరుతుంది. సేంద్రియ సాగు వల్ల భూమి గుల్లబారుతుంది. వాన నీరు ఇంకుతుంది. దీంతో పంట బాగా పండుతుంది.

– మూరా చిన్నబాబు, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి సేద్యం, ప్రత్తిపాడు

నెలకు రూ.20 వేల ఆదాయం



నేనే స్వయంగా ఘన, ద్రవ జీవామృతాలను తయారు చేసుకుంటున్నాను. వీటిని ఉపయోగించడం వల్ల పంటకు ఎలాంటి వైరస్ గానీ తెగుళ్ల కానీ సోకడంలేదు. ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా చేపట్టిన ఆకు కూరలు, కాయగూరల వల్ల నెలకు రూ.20 వేలకు పైబడి ఆదాయం వస్తోంది. రాచపల్లి అడ్డురోడ్డు సమీపాన ప్రకృతి (సేంద్రియ) పద్ధతిలో పంట సాగు ఉండడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చి తన వద్ద ఆకు కూరలు, కాయగూరలు కొనుగోలు చేస్తున్నారు.

– బద్దా నాగమణి, ప్రకృతి వ్యవసాయ సాగుదారు, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం



ఆ ఆకు కూరలకు రుచి ఎక్కువ

సేంద్రియ సాగు ద్వారా పండించిన ఆకు కూరలు, కాయగూరలు రుచితో పాటు ఎక్కువ నిల్వ ఉంటాయి. సహజసిద్ధమైన ఎరువులతో పండించిన పంటలను తింటే ఆరోగ్యానికి మంచిది. వీటి ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉంటున్నాయి.

– బండారు శ్రీగనిలక్ష్మి, గృహిణి, తాటిపర్తి, గొల్లప్రోలు మండలం

రిజిస్ట్రేషన్లు వేగంగా పూర్తి చేయండి



పట్టాల రిజిస్ట్రేషన్ల పరిశీలిస్తున్న తహసీల్దార్ భరత్‌రెడ్డి



కాకరాపల్లిలో ఇళ్ల రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇంతియాజ్

తుని రూరల్: పేదలకు జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు శరవేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేఓ మల్లవరం సచివాలయాన్ని సందర్శించి, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను తనిఖీ చేసి, రిజిస్ట్రేషన్లు చేయడంపై లబ్ధిదారుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సొంతింటి కల నెరవేర్చడంతో పాటు మహిళల పేరున సంపూర్ణ హక్కు కల్పించేందుకే ప్రభుత్వం ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేస్తుందన్నారు. దీంతో మహిళల పేరున ఆస్తి ఏర్పాడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ల పరిశీలన

కోటనందూరు: కాకరాపల్లి గ్రామ సచివాలయంలో జరుగుతున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు చేస్తున్న ఇళ్ల రిజిస్ట్రేషన్లను తహసీల్దార్ ఎస్‌కే ఇంతియాజ్ పాషా మంగళవారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు చేస్తున్న తీరు, ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను డిజిటల్ అసిస్టెంట్‌ను ఆరా తీశారు. ఈ సందర్భంగా తహసీలార్ మాట్లాడుతూ ఇళ్ల రిజిస్ట్రేషన్లలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మండల వ్యాప్తంగా పట్టా ఇచ్చిన ప్రతి లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. గడువులోగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, ఆర్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి రాజానాగేశ్వరరావు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పనులు వేగవంతం చేయండి

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి, గౌరంపేట సచివాలయాల్లో జరుగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, ఈఓపీఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఏలేశ్వరంలో మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- అక్క చెల్లెమ్మలకు ఆసరా చెక్కుల అందజేత

ఏలేశ్వరం: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని కోనేటిబడి ఆవరణలో మంగళవారం పట్టణ పరిధిలోని 516 సంఘాలకు చెందిన 4980 మంది మహిళలకు నాలుగో విడత రూ.4.49 కోట్ల నగదు చెక్కులను ఆయన అందజేశారు. మహిళ సంఘాల ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో నాలుగేళ్లకు పట్టణపరిధిలోని మహిళలకు రూ.17.64 కోట్లు అందజేశారన్నారు. సీఎం జగన్‌పాలనలో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు మహిళలందరూ అండగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్ అధికారంలో ఉంటే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కమిషనర్ శివప్రసాద్, వైస్‌చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామతుల హైమావతి, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల బైక్ ర్యాలీ



వీరవరంలో తోట నరసింహంను కలిసి మద్దతు తెలుపుతున్న సర్పంచ్ ఆదిలక్ష్మి, జోగేశ్వరరావు తదితరులు

గోకవరం: కృష్ణునిపాలెం సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు జోగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణునిపాలెం నుంచి కిర్లంపూడి మండలం వీరవరం వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ తోట నరసింహంను నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఉదయం సుమారు 200 బైక్‌లపై పార్టీ అభిమానులు వీరవరం చేరుకుని తోట నరసింహంను కలుసుకుని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరగా వారికి నరసింహం పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగ్గంపేటలో తోట నరసింహం గెలుపుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట రాంజీ, సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు, సమ్మెటి నాని, దాసరి చినబాబు, వైస్ ఎంపీపీ మైనర్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9 నుంచి 'పల్లెకు పోదాం'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

ప్రత్తిపాడు: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు చేపట్టనున్న 'పల్లెకు పోదాం' (గావ్ ఛలో అభియాన్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. స్థానిక సరయు కన్వెన్షన్ హాలులో మంగళవారం బీజేపీ నియోజకవర్గ స్థాయి 'పల్లెకు పోదాం' కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త వివిధ రంగాల్లో ఉన్న వ్యక్తులను కలిసి, వారిని పార్టీలోకి ఆహ్వానించడం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, రాబోయే ఎన్నికల్లో మరొక్కసారి మోదీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ ఈనెల 9, 10, 11 తేదీల్లో ప్రతి గ్రామంలోనూ పల్లెకుపోదాం నిర్వహించాలన్నారు. పార్టీ కన్వీనర్ ఘంటా బాలుదొర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి రావూరి సుధ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు, జిల్లా కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, మట్ట మంగరాజు, తుమ్మల పద్మజ, కామినేని జయశ్రీ, దాకే కృష్ణారావు, కుంచే జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

తుని: రానున్న సార్వత్రిక ఎన్నికలకు క్షేత్ర స్థాయిలో కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ నాయకులకు సూచించారు. మంగళవారం తునిలో నియోజకవర్గం పార్టీ కన్వీనర్ వెలుగుల గోపాల కృష్ణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రామ్‌కుమార్ కోరారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారయణరాజు, ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్‌రాజు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణతో రైతులకు మేలు



రైతు సదస్సులో మాట్లాడుతన్న సుజాత

పెద్దాపురం: రైతులు సమగ్ర యాజమాన్య సస్య రక్షణ పోషక పద్ధతులు పాటిస్తే రైతులకు మేలు జరుగుతుందని మండల ఉద్యాన శాఖాధికారి ఎన్.సుజాత, పతంజలి ఫుడ్స్ డీజీఎం రవీంద్ర అన్నారు. మండలంలోని ఉలిమేశ్వరం, ఆనూరు, కొండపల్లి గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొబ్బరి, ఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి సుజాత అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో వారు మాట్లాడుతూ సమగ్ర సస్య రక్షణ చర్యలపై రైతులు మరింత అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. జీవ నియంత్రణ పద్ధతుల్లో సమగ్ర సస్య రక్షణతో పురుగును అరికడితే రైతుకు, పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. తెల్లదోమ 25 రోజుల్లో జీవితక్రం పూర్తి చేసుకుటుందన్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 11 వేల హెక్టార్లలో కొబ్బరి, ఆయిల్ పామ్ సాగవుతోందన్నారు. వీటికి రూకోస్ తెల్లదదోమ సోకడం వల్ల ఆకులు నల్లగా మారి దిగుబడి తగ్గుతోందన్నారు. తెల్లదోమ నివారణపై చేపట్టాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ వీహెచ్ఏ ఎం.చిలకమ్మ, పతంజలి ఫుడ్స్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ ఎల్.వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి వెంకట సాయి, వీహెచ్ఏలు చంద్రరావు, మధుతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో ప్రత్యేక నిఘా అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై సిబ్బంది ప్రత్యేక నిఘా ఎంతో అవసరమని డీఎస్పీ లతాకుమారి అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో క్రైం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమన్నారు. నేరాల అదుపులో ఉంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని డీఎస్పీ ఆదేశించారు. అనంతరం స్టేషన్ వారీగా ఉన్న కేసుల పురోగతిపై ఆమె సమీక్షించారు. ఈ సమావేశంలో సీఐ రవికుమార్; డీఎస్పీ కార్యాలయ ఏఎస్ఐ కృష్ణతో పాటు ఆయా స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో అందరూ ఓటు వేసే విధంగా శాంతి భద్రతల రక్షణకు ప్రజల భాగస్వామ్యంతో చర్యలు తీసుకుంటున్నట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురంలో మంగళవారం పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఓటు హక్కును అందరూ ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని సూచించారు. పట్టణంలో శాంతి కమిటీని ఏర్పాటు చేసి శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణ ఎస్సై తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ వరుపుల



లింగంపర్తిలో వరుపులను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. లింగంపర్తి గ్రామంలో మంగళవారం ఆయనను తూర్పులక్ష్మీపురం తదితర గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. సీఎం జగన్ పాలనలో ఎటువంటి అవినీతికి జరగలేదన్నారు. సీఎం జగన్ ఎటువంటి లంచాలకు అవకాశం లేకుండా నేరుగా ప్రజల ఖాతాలకే సొమ్ము జమ చేశారన్నారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ ఆధ్వర్యంలో వరుపులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీనేత వరుపుల సూరిబాబు, కోరాడ నాగభూషణం, శిడగం శ్రీనివాస్, మన్నేపల్లి సత్యనారాయణ, దువ్వాని వీరబాబు, సోమాల నాగేశ్వరరావు, సమ్మెటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం సొసైటీ అధ్యక్షుడిగా దాసరి చినబాబు



గోకవరం: గోకవరం విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దాసరి చినబాబును నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఇప్పటి వరకు సొసైటీ చైర్మన్‌గా పని చేస్తున్న గాజింగం సత్తిబాబు రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో చినబాబును నియమించారు. సీనియర్ రాజకీయ నేతగా ఉన్న ఆయన గతంలో పలుమార్లు సొసైటీ అధ్యక్షుడిగా, గోకవరం సర్పంచ్‌గా పని చేశారు. ఆయన నియామకంపై మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 14న ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలియ వచ్చింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తొండంగి: వేమవరం సమీపంలో రెండుబైకులు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమవరం వద్ద చేపల చెరువుల వద్ద పనిచేస్తున్న కుర్రా గోవింద్, వెంకట్, పి.శివ, వెంకట్ కలిసి సోమవారం పైడికొండ వెళ్లారు. పైడి కొండ నుంచి బైకుపై తిరిగి వేమవరం వస్తుండగా ఎదురుగా మరో బైకు వీరిని బలంగా ఢీకొట్టింది. దీంతో పి.శివ, వెంకట్‌లకు తీవ్ర గాయాలు కాగా, గోవిందుకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శివ, వెంకట్‌లను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంగళవారం ఉదయం పి.శివ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

కిర్లంపూడి: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 25 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు కిర్లంపూడి ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. సోమవరం గ్రామ శివారున సారా అమ్ముతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఎస్సై జబీర్ తమ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. సారా అమ్ముతున్న సాకా పైడియ్యను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

9న తునిలో షర్మిల రోడ్ షో

తుని: కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 9న తుని పట్టణ పర్యటనకు వస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు తెలిపారు. మంగళవారం తుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యురాలు, జిల్లా ఇన్‌చార్జి సుంకర పద్మశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 9న తుని పట్టణంలో సాయంత్రం షర్మిల రోడ్ షోలో పాల్గొంటారన్నారు.

రౌతులపూడి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేపట్టి రోడ్ షోను వియవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ ఉమ్మిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మండలంలో పర్యటించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: పురుగులు మందు డబ్బాలో మద్యం పోసుకుని తాగిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండెవరం శివారు కాశివారిపాకలకు చెందిన జిగటాల నాగబాబు(38) ఈ నెల ఒకటో తేదీన పొలం గట్టుపై ఉన్న పురుగుల మందు డబ్బాలోని మద్యం పోసుకుని సేవించాడు. అప్పటినుంచి నాగబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఐదో తేదీన కాకినాడ ప్రభుత్వ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.